AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

29-5-2026 (Friday) MAIN EDITION

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ఈ ఏడాది తక్కువ వర్షాలు




**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలోకి నైరుతి రుతు పవనాలు మరికొన్ని రోజుల్లో ప్రవేశించనున్నాయి. దీంతో జూన్ తొలివారంలో తొలకరి పలకరించనుంది. అయితే వాతావారణ శాఖ రైతులకు బ్యాడ్ న్యూస్ చెప్పింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 50 శాతం సాధారణ వర్షాలు, 50 శాతం లోటు వర్షాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ యేడు వర్షాకాలం 2018 నాటి పరిస్థితులను పోలి ఉంటుందన్నారు. గతేడాది రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. అయితే ఈ యేడు పరిస్థితులు వేరుగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## పెద్ది సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతి




**అక్షరటుడే, సినిమా డెస్క్:** మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన పెద్ది మూవీ జూన్ 4న విడుదల కానుంది. ఈ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో రూ.100 చొప్పున, మల్టీప్లెక్స్‌లలో రూ.125 చొప్పున పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది. పెద్ది ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600గా నిర్ణయించింది. అలాగే రోజుకు ఐదు షోలు వేసుకోవడానికి సైతం ఓకే చెప్పింది. పెరిగిన రేట్లు జూన్ 4 నుంచి జూన్ 10 వరకు అమల్లో ఉండనున్నాయి.

## హైడ్రాలో 'ఈగల్ టీమ్'లో ట్రాన్స్‌జెండర్లు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: ఒకప్పుడు సమాజంలో అవహేళనలు, వివక్షను ఎదుర్కొన్న ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో హైదరాబాద్ హైడ్రా కొత్త వెలుగులు నింపింది. హైడ్రా కల్పించిన ఉద్యోగావకాశాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, సమాజంలో తలెత్తుకుని జీవించేలా గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ఈ విభాగంలో మొత్తం 16 మంది ట్రాన్స్‌జెండర్లు విధులు నిర్వహిస్తున్నారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా..




అక్షరటుడే, ఏపీ: ఏపీలోని వైఎస్సార్ జిల్లా గోపవరం మండలం పీపీకుంట సమీపంలో అర్ధరాత్రి ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. విజయవాడ నుంచి కడపకు వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులో సుమారు 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పలువురికి గాయాలవగా ఆస్పత్రికి తరలించారు.

## కల్తీ మద్యం తాగి 15 మంది మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్: మహారాష్ట్రలోని పుణేలో కల్తీ మద్యం తాగి 15 మంది మరణించడం సంచలనం సృష్టించింది. పింప్రి-చింఛ్వాడ్, అలాగే దపోడి, పుణే వాడి ప్రాంతాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హడప్సర్ ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు యువకులు కూడా మరణించారు. పలువురు అస్వస్థతకు గురి కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## మొబైల్ ఫుడ్ కోర్టుగా పాత కారు..



**అక్షరటుడే, ఏపీ:** దేశంలో ఎంతో మంది ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొలువులు లభించకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. అదే సమయంలో కొందరు యువత తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి ఉపాధి పొందుతున్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాల కోసం ఆశపడకుండా, గుంటూరు యువకులు స్వయం ఉపాధితో రాణిస్తున్నారు. ఒక పాత కారును వినూత్నంగా మొబైల్ ఫుడ్ కోర్ట్‌గా మార్చారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారి కోసం బొగ్గుల పొయ్యిపై కాల్చిన 'ఆయిల్ లెస్ చికెన్ స్నాక్స్' అందిస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. వీరి వినూత్న వ్యాపార ఆలోచన ప్రస్తుతం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.

**దేశవ్యాప్తంగా పెండింగ్ కేసులు పేరుకుపోతుండడంతో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. తీర్పులు ఆలస్యం చేయొద్దంటూ హైకోర్టులకు సూచించింది. రిజర్వ్ చేసిన తీర్పులపై అన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ విడుదల చేసింది. తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత దానిని వెలువరిం చేందుకు గరిష్టంగా 3 నెలల సమయం మాత్రమే తీసు కోవాలని ఆదేశించింది.** – అక్షరటుడే, ఢిల్లీ



# తీర్పులు ఆలస్యం చేయొద్దు..

**■ రిజర్వ్ చేసిన మూడు నెలల్లో జడ్జిమెంట్ ఇవ్వాలి ■ సుప్రీం కీలక ఆదేశాలు**

దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో తీర్పుల వెల్లడిలో జరుగుతున్న సుదీర్ఘ ఆలస్యానికి అడ్డుకట్ట వేసేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకు లభించిన అసాధారణ అధికారాలను ఉపయోగించి, దేశంలోని అన్ని హైకోర్టులు కచ్చితంగా పాటించాల్సిన పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. జార్ఖండ్ హైకోర్టులో తీర్పుల ప్రకటన, వెబ్‌సైట్లలో వాటి అప్‌లోడింగ్‌లో జరుగుతున్న విపరీతమైన ఆలస్యంపై దాఖలైన ఒక పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఈ సంచలన తీర్పును వెలువరించింది.

### రిజర్వ్ తీర్పులకు మూడు నెలల డెడ్‌లైన్

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ సరికొత్త నిబంధనల ప్రకారం.. హైకోర్టులు తాము రిజర్వ్ చేసిన తీర్పులను గరిష్ఠంగా మూడు నెలలలోపు తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ప్రజలు న్యాయం కోసం ఆశ్రయించే ప్రాథమిక సంస్థలు హైకోర్టులేనని, అందువల్ల సకాలంలో తీర్పులు ఇవ్వడం అత్యంత ఆవశ్యకమని ఈ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే, ఈ గైడ్‌లైన్స్ ఏ ఒక్క వ్యక్తిగత న్యాయమూర్తిని లేదా వ్యవస్థను విమర్శించడానికి ఉద్దేశించినవి కావని కోర్టు స్పష్టం చేసింది.

### బెయిల్ పిటిషన్లపై సంచలన ఆదేశాలు

ముఖ్యంగా బెయిల్ దరఖాస్తుల విషయంలో సుప్రీంకోర్టు అత్యంత కీలక నిర్ణయాలు ప్రకటించింది. బెయిల్ అభ్యర్థనలపై సాధ్యమైనంత వరకు విచారణ జరిగిన రోజే ఆదేశాలు ఇవ్వాలని, ఒకవేళ ఆర్డర్‌ను రిజర్వ్ చేస్తే మరుసటి రోజే దానిని కచ్చితంగా ప్రకటించాలని స్పష్టం చేసింది. రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులను తక్షణమే లోయర్ కోర్టులకు సమాచారం అందించాలని, బెయిల్ పొందిన విచారణ ఖైదీలను అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేసి, అదే రోజు విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

### 24 గంటల్లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్

సాంకేతికతను వాడుకుంటూ పారదర్శకతను పెంచేందుకు వీలుగా.. న్యాయస్థానాలు తీర్పులను ప్రకటించిన 24 గంటల లోపు వాటిని ఆయా హైకోర్టుల అధికారిక వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి అని ధర్మాసనం పేర్కొంది. అంతేకాకుండా, ఒక తీర్పులోని ప్రధాన కార్యాచరణ భాగాన్ని ప్రకటించిన తేదీనే, ఆ తీర్పు వెల్లడించిన పూర్తి తేదీగా పరిగణించాలని కోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయంతో ఇకపై హైకోర్టుల తీర్పుల్లో వేగం పెరగనుంది.

## రాహుల్ గాంధీతో సిద్ధరామయ్య కీలక భేటీ..




**అక్షరటుడే, ఢిల్లీ:** కర్ణాటక సీఎం పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. గురువారం రాత్రే ఢిల్లీకి చేరుకున్న ఆయన.. శుక్రవారం ఉదయం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. కర్ణాటకలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు, తదుపరి మంత్రివర్గ కూర్పుపై వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా సిద్ధరామయ్య తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణతో పాటు హైకమాండ్ ముందు పలు కీలక డిమాండ్లను ఉంచినట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. సమావేశానికి సిద్ధరామయ్య తన కుమారుడు యతీంద్రను కూడా వెంటబెట్టుకుని వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొత్త కేబినెట్‌లో తన కుమారుడికి కీలకమైన మంత్రిత్వ శాఖను కేటాయించాలని ఆయన రాహుల్ గాంధీని కోరినట్లు సమాచారం. యతీంద్రకు వైద్య విద్య లేదా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇవ్వాలని.. లేనిపక్షంలో గతంలో డీకే శివకుమార్ నిర్వహించిన ఇరిగేషన్ (జలవనరులు), పరిశ్రమల శాఖల్లో ఒకదానిని కేటాయించాలని అడిగినట్లు తెలుస్తోంది.

## దెబ్బతిన్న 'గంగా ఎక్స్‌ప్రెస్ వే'




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'గంగా ఎక్స్‌ప్రెస్ వే' ప్రారంభమైన నెల రోజులైనా కాకముందే దెబ్బతినడం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు దాదాపు రూ.36,230 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ హైవేను ఈ సంవత్సరం ఏప్రిల్ 29న ప్రధాని మోదీ ఘనంగా ప్రారంభించారు. అయితే, ప్రజలకు అందుబాటులోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే రోడ్డుపై పెద్ద ఎత్తున పగుళ్లు రావడం చర్చకు దారితీసింది. రూ.వేల కోట్లు కుమ్మరించి నిర్మించిన రోడ్డు పరిస్థితి ఇంత ఘోరంగా ఉందా అంటూ వాహనదారులు, నెటిజన్లు మండిపడుతున్నారు.

## మద్యం మత్తులో ఏఎస్సై హల్‌చల్



**అక్షరటుడే, తిరుపతి:** భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుపతిలో ఓ ఏఎస్సై మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. పూటుగా తాగి ఓ హోటల్ యజమానితో గొడవ పడ్డాడు. ఉచితంగా బిర్యానీ ఇవ్వలేదని పూర్వీక సెంటర్‌లో ఉన్న హోటల్ యజమానిపై ఎస్పీఎఫ్ ఏఎస్ఐ రాము దాడికి దిగారు. నన్నే డబ్బులు అడుగుతావా అంటూ యజమానిపై దాడి చేయడంతో, తిరిగి ఏఎస్ఐపై హోటల్ యజమాని దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికులు వారిని విడిపించారు.

## తెలంగాణలో 'రైతు డిస్కం' ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో సాగు రంగానికి మరింత నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'రైతు డిస్కం' ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నూతన డిస్కం పూర్తిస్థాయి సిబ్బందితో తన అధికారిక కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ సరికొత్త సంస్థకు సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నూతన డిస్కంకు సంబంధించిన అధికారిక లోగోను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. పచ్చని పంటసాగు దృశ్యం బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్న ఈ లోగోలో... భవిష్యత్తు ఇంధన వనరులైన సౌర (సోలార్), జల (హైడ్రో), పవన (విండ్) విద్యుత్ చిహ్నాలను ప్రత్యేకంగా పొందుపరిచారు. ఇది రైతులకు పర్యావరణహిత, నిరంతర విద్యుత్ సరఫరాను ప్రతిబింబించేలా ఉంది.


## 'ది రెడ్ బ్యాగ్' రాధ్య ఫస్ట్ లుక్ రిలీజ్..



**రవి కుమార్ సీరపు డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ది రెడ్ బ్యాగ్'. ఒక రహస్యమైన బ్యాగ్ చుట్టూ తిరిగే ఉత్కంఠభరితమైన కథతో ఈ చిత్రం రూపొందుతోంది. అయితే ఇందులో రాధ్య హీరోయిన్‌గా నటిస్తుండగా.. షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా.. మేకర్స్ హీరోయిన్ రాధ్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరోయిన్ రాధ్య చేతిలో ఒక గన్ పట్టుకుని పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించింది. పోస్టర్‌ను షేర్ చేస్తూ మేకర్స్ పెట్టిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## లాంచ్ ప్యాడ్‌పైనే పేలిన రాకెట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బ్లూ ఆరిజిన్ న్యూ గ్లెన్ రాకెట్ లాంచ్ ప్యాడ్‌పై పేలిపోయింది. హాట్ ఫైర్ టెస్ట్ సమయంలో భారీ పేలుడు చోటుచేసుకుంది. అమెరికాలోని కేప్ కార్నవల్‌లో స్పేస్ స్టేషన్‌లో ప్రమాదం జరిగింది. జెఫ్ బెజోస్ యాజమాన్యంలోని బ్లూ ఆరిజిన్ కంపెనీ అభివృద్ధి చేస్తున్న భారీ రాకెట్ న్యూ గ్లెన్. లాంచ్ ప్యాడ్ పైనే ఈ రాకెట్ పేలిపోయింది. దీంతో ప్రాణనష్టం తప్పింది. బ్లూ ఆరిజిన్‌కు చెందిన ఒక రాకెట్ లాంచ్ ప్యాడ్ వద్ద పరీక్ష నిర్వహిస్తుండగా పేలిపోయింది. వచ్చే వారం జరగనున్న ఉపగ్రహ ప్రయోగానికి ముందు నిర్వహిస్తున్న ఇంజిన్‌ఫైరింగ్ పరీక్ష సమయంలో తమ న్యూ గ్లెన్ రాకెట్ పేలిపోయిందని బ్లూ ఆరిజిన్ తెలిపింది.

## కూలిన భారీ వంతెన.. ఆరుగురు కార్మికుల మృతి

**అక్షరటుడే, ఉత్తరప్రదేశ్:** ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో బెట్వా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. తీవ్ర తుఫాను కారణంగా బ్రిడ్జి కూలింది. ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందగా, పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం. హమీర్‌పూర్ జిల్లాలో గురువారం రాత్రి తుఫాను కారణంగా నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోవడంతో కనీసం ఆరుగురు కార్మికులు మరణించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మొరకందర్ నుంచి కందౌర్ వరకు విస్తరించి ఉన్న ఈ వంతెనను బెట్వా నదిపై నిర్మిస్తున్నారు. ఈ ఘటన అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో జరిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు హమీర్‌పూర్ ఏఎస్పీ అరవింద్ కుమార్ వర్మ తెలిపారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి.